BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 24 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4



## గవర్నర్‌తో కొత్త వీసీల భేటి

బలగం టీవీ,హైదరాబాద్

:కొత్తగా నియమితులైన రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం సమావేశమయ్యారు. ఉన్నత విద్యను ప్రోత్సహించే ఉద్దేశంతో విద్యారంగంలో తీసుకురావాల్సిన మిగితా 2వ పేజీలో

# ప్రపంచ శాంతికి భారత్, చైనా సంబంధాలు కీలకం

- ప్రధాని మోడీ
- బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు



అభివృద్ధికి సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవడంలో, అలాగే కమ్యూకినకేషన్స్ రంగంలో వ్యూహాత్మక సహకారాన్ని పెంపొందిం చుకోవాల్సిన అవసరమెంతైనా ఉందని భారత్, చైనా నేతలిరువురూ అంగీకరించారు. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ బుధవారం నాడిక్కడ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జనాభా పరంగా ప్రపంచంలో రెండు అతి పెద్ద దేశాలైన భారత్, చైనాల మధ్య సంబంధాల మెరుగుదల సరిహద్దుల్లో ఉద్రిక్తతలను తగ్గించడమే కాదు, ప్రపంచ శాంతికి కూడా దోహదపడుతుంద న్నారు. ప్రపంచ జనాభాలో ఈ రెండు దేశాలు 34 శాతం దాకా వాటా కలిగి ఉన్నాయి. సరిహద్దుల్లో ఉద్రిక్తతలకు సంబంధించి నాలుగున్నరేళ్లుగా ప్రతిష్టంభనను తొలగించి 2020 మే నెలకు ముందున్న స్థితిని పునరుద్ధరిస్తూ ఇటీవల కుదిరిన ఒప్పందాన్ని ఇరువురు నేతలు స్వాగతించారు. తమ రెండు ఇరుగుపొరుగు దేశాల మధ్య సామరస్యపూర్వక, సుస్థిర సంబంధాలు ఈ ప్రాంతానికి, అలాగే ప్రపంచ శాంతికి చాలా అవసరమన్నారు. ఇరు దేశాల మధ్య విభేదాలను సరైన రీతిలో పరిష్కరించుకోవడానికి కృషి చేస్తూనే కమ్యూనికేషన్, సహకార బంధాన్ని మరింత బలోపేతం గావించడంపై దృష్టి పెట్టాలని జిన్‌పింగ్ మోడీని కోరారు. 2019 తరువాత ఈ ఇరువురి నేతల మధ్య ద్వైపాక్షిక భేటీ జరగడం ఇదే మొదటిసారి. చివరి సారి చెన్నైలో ఇండియా-చైనా ఇష్టాగోష్టి సమ్మిట్ జరిగింది. మొదటి ఇష్టాగోష్టి సమ్మిట్ చైనాలోని వుహాన్‌లో 2018 ఏప్రిల్‌లో జరిగింది.

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

ప్రపంచ శాంతికి భారత, చైనాల మధ్య సయోధ్య చాలా కీలకం అని ప్రధాని మోడీ అన్నారు. రష్యాలోని కజాన్ లో బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ ల మధ్య ద్వైపాక్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా, భారత, చైనాల మధ్య సయోధ్య ప్రపంచ శాంతికి చాలా కీలకమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ భారత్, చైనా సరిహద్దులో శాంతి, సుస్థిరతను కాపాడటం తమ ప్రాధాన్యాంశంగా ఉండాలని అన్నారు. “ఐదేళ్ల తర్వాత జరిగినన మా తొలి అధికారిక సమావేశం ఇదే. సరిహద్దు వెంబడి మనం కుదుర్చుకున్న ఒప్పందాలను స్వాగతిస్తున్నాం. సరిహద్దుల్లో శాంతి, సామరస్యాలను కాపాడుకోవడం మన ప్రాధాన్యాంశంగా ఉండాలి. పరస్పర విశ్వాసం, పరస్పర గౌరవం, పరస్పర సామరస్యం మన సంబంధాలకు ప్రాతిపదికగా ఉండాలి. మన చర్చలు మనస్ఫూర్తిగా, నిర్మాణాత్మకంగా ఉంటాయని నేను విశ్వసిస్తున్నాను” అని ప్రధాని మోదీ ఈ సమావేశంలో చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ తో వ్యాఖ్యానించారు.

తూర్పు లద్దాఖ్ లోని వాస్తవాధీన రేఖ వద్ద ఇరు దేశాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయాన్ని ప్రధాని స్వాగతించారు. సరిహద్దుల్లో గత నాలుగేళ్లుగా తలెత్తిన సమస్యల పరిష్కారంలో ఏకాభిప్రాయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. పరస్పర విశ్వాసం, పరస్పర గౌరవం, పరస్పర సామరస్యం భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలకు మార్గనిర్దేశం చేస్తాయని ప్రధాని మోదీ ఎక్స్ లో పోస్ట్ చేశారు. “కజాన్ బ్రిక్స్ సదస్సు సందర్భంగా అధ్యక్షుడు జిన్ పింగ్ తో భేటీ అయ్యాను. మన దేశాల ప్రజలకు, ప్రాంతీయ, ప్రపంచ శాంతి, సుస్థిరతలకు భారత్-చైనా సంబంధాలు చాలా ముఖ్యం. పరస్పర విశ్వాసం, పరస్పర గౌరవం, పరస్పర సున్నితత్వం ద్వైపాక్షిక సంబంధాలకు మార్గనిర్దేశం చేస్తాయి” అని ప్రధాని మోదీ ఎక్స్ లో రాశారు.

భారత్, చైనాలు మరింత సమాచారం, సహకారాన్ని కలిగి ఉండటం, విభేదాలను సక్రమంగా పరిష్కరించుకోవడం చాలా ముఖ్యమని జిన్ పింగ్ అన్నారు. ఐదేళ్లలో అధికారికంగా తాము సమావేశం కావడం ఇదే తొలిసారి అన్నారు. “ఇరు దేశాల ప్రజలు, అంతర్జాతీయ సమాజం మా సమావేశంపై ఎంతో శ్రద్ధ కనబరు స్తున్నాయి. చైనా, భారతదేశం రెండూ పురాతన నాగరికతలు. అభివృద్ధి చెందుతున్న దేశాలు. గ్లోబల్ సౌత్ యొక్క ముఖ్యమైన సభ్యులు. ఈ రెండు దేశాలు తమ తమ ఆధునీకరణ ప్రయత్నాల్లో కీలక దశలో ఉన్నాయి. ఇది మన రెండు దేశాల ప్రాథమిక ప్రయోజనాలకు బాగా ఉపయోగపడుతుంది. చరిత్ర ధోరణిని, ద్వైపాక్షిక సంబంధాలను సరైన దిశను కొనసాగించడానికి, ఇరు పక్షాలు మరింత పరస్పర సమాచారాన్ని, పరస్పర సహకారాన్ని కలిగి ఉండాలి. విభేదాలను సరిగ్గా పరిష్కరించుకోవాలి” అని షీ జిన్ పింగ్ అన్నారు.అంతర్జాతీయ బాధ్యతను భుజాన వేసుకోవడం, వర్ధమాన దేశాల బలం, ఐక్యతను పెంపొందించడం, అంతర్జాతీయ సంబంధాల్లో బహుళ ధృవీకరణ, ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి దోహదపడటం కూడా ఇరు పక్షాలకు ముఖ్యమని జిన్ పింగ్ అన్నారు. తూర్పు లద్దాఖ్లోని ఎల్ఏసీ వద్ద ఇరుదేశాల సైనికుల మధ్య తీవ్రస్థాయి ఘర్షణ ప్రారంభం కావడానికి కొన్ని నెలల ముందు 2019 అక్టోబర్ లో ఇరువురు నేతలు చివరిసారిగా భారత్ లో శిఖరాగ్ర సమావేశం కోసం కలుసుకున్నారు. 2020 జూన్ లో సరిహద్దుల్లో జరిగిన సైనిక ఘర్షణలో కనీసం 20 మంది భారత సైనికులు, పలువురు చైనా సైనికులు మరణించిన తరువాత ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి.



## వయనాడ్‌లో ప్రియాంక గాంధీ నామినేషన్

బలగం టీవీ, తిరువనంతపురం

కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా బుధవారం తన నామినేషన్ వేశారు. తన పేరన ఉన్న ఆస్తి రూ.12 కోట్లుగా చూపారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన ఆదాయం రూ. 46.39 లక్షలు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో మూడు బ్యాంకు ఖాతాల్లో వివిధ మొత్తాలలో డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు, ఆమె భర్త రాబర్ట్ వాద్రా బహుమతిగా ఇచ్చిన హౌండా ( సిఆర్‌వి) కారు , 4,400 గ్రాముల బంగారం, సిమ్లాలో రూ. 5.6 కోట్ల విలువ చేసే విలాసవంతమైన భవనం ఉన్నట్లు తెలిపారు. ఆమె స్థిరాస్తులు 7.74 కోట్లకు పైగా ఉన్నాయి. ఇందులో న్యూ ఢిల్లీలోని మెహ్రౌలీ ప్రాంతంలో వారసత్వంగా వచ్చిన రెండు వ్యవసాయ క్షేత్రాలు, ఫామ్‌హౌస్ భవనంలో సగం వాటా ఉంది రాహుల్ గాంధీ రారు బరేలి స్థానాన్ని ఉంచుకుని వాయనాడ్‌ను వదులుకోవడంతో ఈ ఉప ఎన్నికల అవసరమైంది.

తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తున్న ఆమె నామినేషన్ వేయడానికి ముందు భారీ ర్యాలీ నిర్వహించారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు ఇతర సీనియర్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ ప్రారంభానికి ముందు కాంగ్రెస్ స్థానిక నేతల సమక్షంలో నామినేషన్ పత్రాలపై ప్రియాంకగాంధీ సంతకాలు చేశారు. ఆ తర్వాత ర్యాలీలో పాల్గొన్న ప్రియాంక.. భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులని, వారికోసం నిలబడేందుకు ఇక్కడికి వచ్చినట్లు ప్రియాంక గాంధీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రియాంక తర్వాత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తాను అనధికారికంగా వయనాడ్ ఎంపీనే అన్నారు. తన సోదరి ఇక్కడి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ తన తల్లి ప్రాతినిధ్యం వహించిన రాయబరేలీ నుంచి ఎంపీగా కొనసాగాలని నిర్ణయించినప్పుడు.. ప్రియాంక గాంధీని వయనాడ్ నుంచి పోటీకి దింపాలనే డిమాండ్ ఇక్కడి ప్రజల నుంచి వినిపించిందన్నారు. ప్రజల కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రియాంకను అభ్యర్థిగా ఖరారు చేసిందని తెలిపారు. బహిరంగ సభ తర్వాత ప్రియాంక గాంధీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

## స్మార్ట్ సిటీని సందర్శించిన తెలంగాణ డెలిగేషన్ టీమ్



బలగం టీవీ,హైదరాబాద్

దక్షిణ కొరియా రాజధాని సియోల్ లో పర్యటిస్తున్న తెలంగాణ అధికార బృందం మూడో రోజైన బుధవారం మూడు అంతర్జాతీయ స్మార్ట్ సిటీలను సందర్శించింది. దక్షిణ కొరియాలోని ఇంచియాన్ నగరంలో భాగమైన చియోంగ్న, సాంగడో, యోంగ్ జాంగ్ స్మార్ట్ సిటీలను సందర్శించింది. ఈ సందర్శనలో తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, ప్రకాశ్ గౌడ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. దక్షిణ కొరియా ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడం కోసం 2003లో ఇంచియాన్ ఫ్రీ ఎకనామిక్ జోన్ స్థాపించారని చెప్పారు. ఫైనాన్స్ టూరిజం వ్యాపారం కోసం ఒక ఐటీబీటీ హబ్ ను నాలెడ్జ్, సర్వీస్ ఇండస్ట్రీని స్థాపించారని ఇది లాజిస్టిక్స్ అండ్ టూరిజం పై దృష్టి సారిస్తుందని తెలిపారు.

## కాళేశ్వరం కమిషన్ విచారణ షురూ..



బలగం టీవీ,హైదరాబాద్

కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ మళ్లీ మొదలైంది. బుధవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఈఎన్‌సీ నాగేందర్, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిపై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. ఓపెన్ కోర్టులో వాడీవేడిగా విచారణ సాగింది. దాదాపు మూడు గంటల పాటు 130కి పైగా ప్రశ్నలు వేసినట్టు తెలుస్తోంది. కమిషన్ ముందు సదరు ఇంజినీర్లు కీలకాంశాలు వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్టు ఇచ్చిన సర్టిఫికెట్‌లో నిబంధనలు పాటించలేదని నాగేందర్ తెలిపారు. ఈ సందర్భంగా క్వాలిటీ చెక్ చేయకుండా అఫిడవిట్ ఎలా ఇస్తారంటూ కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు ఎన్నిసార్లు మేడిగడ్డ, అన్నారం విజిట్ చేశారో చెప్పాలనీ, అదే సమయం లో సుందిళ్లను ఎందుకు పరిశీలించలేదంటూ కమిషన్ ప్రశ్నించింది. అయితే, తాము మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను ప్రమాదం జరగకముందు విజిట్ చేశామంటూ క్వాలిటీ కంట్రోల్ సీఈ సమాధానమిచ్చారు.

కాళేశ్వరం కమిషన్ ఓపెన్ కోర్టు విచారణలో బుధవారం మధ్యాహ్నం తర్వాత క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్ కమిషన్ ఎదుట హాజరయ్యారు. అజయ్ కుమార్‌పై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. క్వాలిటీ కంట్రోల్ సీఈ స్థాయిలో ఉండి రికార్డ్స్ చెక్ చేయకుండా అఫిడవిట్ ఎలా సబ్మిట్ చేస్తారని ప్రశ్నించింది. క్వాలిటీ కంట్రోల్ పని ఏంటి? పరిధి ఏంటి? ఇప్పటివరకు ఏం పని చేశారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను ఎన్నిసార్లు విజిట్ చేశారని అడిగింది. దీనికి ఈ రెండు బ్యారేజీలను ప్రమాదం జరగక ముందు పరిశీలించానని తెలిపారు. సుందిళ్లను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించింది. మొదటి సారి ఫ్లడ్స్ వచ్చిన తర్వాత మూడు బ్యారేజీలను క్వాలిటీ కంట్రోల్ సీఈగా విజిట్ చేశారా..? అని కమిషన్ ప్రశ్నించింది. గ్రౌండ్‌లో సమస్యలు ఉన్నాయని రిపోర్టులు రావడంతో విజిట్ చేయలేదని అజయ్ కుమార్ వివరణ ఇచ్చారు.

అలాగే ఉదయం విచారణకు హాజరైన ఈఎన్సీ నాగేందర్‌పై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఆగ్రహం వ్యక్తం చేసింది. దాదాపు మూడు గంటలపాటు ఆయనను ప్రశ్నించింది. దాదాపు 130కి పైగా ప్రశ్నలు వేసినట్టు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్‌లో నిబంధనలు పాటించలేదని నాగేందర్ తెలిపారు. రామగుండం ఈఎన్‌సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్లు కమిషన్ ముందు చెప్పారు. ఆయన నిబంధనలు పాటించలేదని తెలిపారు. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీలలో లీకేజీలు జరిగాయా అని.. గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. వరదల సమయంలో గేట్లు మిగితా 2వ పేజీలో

## హోంమంత్రిని నియమించండి

- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్
- బాగ్ అంబర్‌పేటలో హత్యకు గురైన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ దంపతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

వివరాలు 2వ పేజీలో

## నాంపల్లి కోర్టులో కేటీఆర్ స్టేట్‌మెంట్ రికార్డు

- కొండా మాట్లాడిన కొన్ని మాటలు ఆవేదన కలిగించాయి. వాటిని చెప్పలేకపోతున్నా.
- పబ్లిసిటీ కోసమే దిగజారుడు ఆరోపణలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

బలగం టీవీ,హైదరాబాద్

మంత్రి కొండా సురేఖ పై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో నాంపల్లి కోర్టులో కేటీఆర్ వాంగ్మూలం ఇచ్చారు. కొండా సురేఖ వ్యాఖ్యలు తనతో పాటు పార్టీకి కూడా తీవ్రంగా నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయని కోర్టులో కేటీఆర్ స్టేట్ మెంట్ ఇచ్చారు. తనపై కొండా సురేఖ చేసిన కామెంట్లను చూసి సాక్షులు తనకు ఫోన్ చేశారన్నారు. కొండా సురేఖ వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని వాటిని విని షాక్ గురయ్యానని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షులు తనకు 18 ఏళ్లుగా తెలుసని వారు కూడా ఈ వ్యాఖ్యలు విని చాలా బాధపడ్డారని చెప్పారు. బాధ్యత గల మంత్రి పదవిలో ఉండి అత్యంత దిగజారుడు వ్యాఖ్యలను కొండా సురేఖ చేశారని కేటీఆర్ తన వాంగ్మూలంలో తెలిపారు. ఆమె మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా తీవ్ర ఆవేదన కలిగించేలా ఉన్నాయని కోర్టుకు చెప్పారు. నేను డ్రగ్ అడిక్ట్ అని, రేవ్ పార్టీలు నిర్వహిస్తానని ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం పబ్లిసిటీ కోసమే కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు అన్ని చెప్పలేకపోతున్నానని ఫిర్యాదు లో ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కేటీఆర్ కోర్టును కోరారు. దాదాపు అరగంట పాటు కోర్టులో కేటీఆర్ తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. కొండా సురేఖ చేసిన కామెంట్ల వీడియోలను ఈ సందర్భంగా కోర్టుకు సమర్పించారు. కేటీఆర్ తో పాటు సాక్షిగా ఉన్న దాసోజు శ్రవణ్ స్టేట్ మెంట్ ను కూడా కోర్టు నమోదు చేసుకుంది. మిగతా సాక్షుల స్టేట్ మెంట్లను రికార్డ్ ను కోర్టు ఈ నెల 30 కి వాయిదా వేసింది.

గతంలోనూ కేటీఆర్ పై కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. అప్పుడు ఎన్నికల సంఘం ఆమె తీరుపై మండిపడింది. అయినప్పటికీ కొండా సురేఖ తీరులో ఎలాంటి మార్పు రాలేదు. మళ్లీ అవే ఆరోపణలు చేయటంతో బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ ఆమెకు లీగల్ నోటీసులు ఇచ్చారు. మంత్రి నుంచి ఎలాంటి సమాధానం రాకపోటవంతో కొండా సురేఖ పై పరువు నష్టం దావా కేసును కేటీఆర్ ఫైల్ చేశారు. ఈ నెల 21 నే స్టేట్ మెంట్ రికార్డ్ చేయాల్సి ఉన్నప్పటికీ కేటీఆర్ అభ్యర్థన మేరకు గురువారం వరకు కోర్టు సమయమిచ్చింది. ఇవ్వాళ మధ్యాహ్నం 3.30 గంటలకు తెలంగాణ భవన్ నుంచి కేటీఆర్ సహా ఈ కేసులో సాక్షులుగా ఉన్న దాసోజు శ్రవణ్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, బాల్క సమన్, మాజీ మంత్రి జగదీష్ తో పాటు బీఆర్ఎస్ నేతలు నాంపల్లి కోర్టుకు బయలుదేరారు.

## ఎమ్మెల్యేలను చేర్చుకోవడం పార్టీ అధిష్ఠానం నిర్ణయం

- టీపీసిసి చీఫ్ మహేష్ కుమార్



బలగం టీవీ,హైదరాబాద్

%కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేటు వేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.జీవన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తాజాగా టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డి విమర్శలు ఆయన వ్యక్తిగతమని, ఇతర పార్టీల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలను గౌరవించుకోవలసిన అవసరం ఉందని తెలిపారు . ఎమ్మెల్యేలను చేర్చుకోవడం అనేది పార్టీ అధిష్టానం నిర్ణయం అని చెప్పారు. పార్టీ నిర్ణయం ప్రకారమే ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని అన్నారు. దీనివల్ల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రతిష్టకు ఎక్కడ భంగం వాటిల్లలేదని పేర్కొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుకు సహకారం అందించడండి




- మలేషియాను కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బలగం టీవీ, హైదరాబాద్

ఆయిల్ పామ్ విస్తరణవకాశాలు, ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వహణ, సాగులో అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు, ఆయిల్ పామ్ ఉత్పాదకాలు మున్నగువాటి గురించి శాస్త్రీయ అధ్యాయానికమంత్రి తుమ్మల నాగేశ్వరరావుగా, వ్యవసాయశాఖ కార్యదర్శి శ్రీ రఘునందన్ రావు , డైరెక్టర్, ఉద్యానశాఖ, ఎండీ ఆయిల్ ఫెడ్ శ్రీమతి యాస్మిన్ బాషా గారు వారి బృందం మలేషియా పర్యటనలో భాగంగా బుధవారంమలేషియా ప్లాంటేషన్ మరియు కమోడిటీస్ మంత్రి జోహరి అబ్దుల్ ఘనిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వము ఆయిల్ పామ్ సాగుకోసం అందిస్తున్న ప్రోత్సహకాలు, ప్రస్తుత పరిస్థితి మరియు రానున్న రోజుల్లో ఆయిల్ పామ్ పరిశ్రమ అభివృద్ధికి గల అవకాశాలు వివరించి, ఆయిల్ పామ్ సాగులో అగ్రగామి దేశాలలో ఒకటిగా ఉన్న మలేషియా నుంచి సహకారం అందించగలరని కోరారు.

మలేషియా మంత్రి మాట్లాడుతూ, 143 కోట్ల జనాభా గల దేశానికి ఆహారం అందించడం చాలా గొప్ప విషయమని, ప్రపంచ దేశాలు అన్నీ భారతదేశం ఆ దిశలో అవలంబిస్తున్న విధివిధానాలను చూసి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పామ్‌ఆయిల్ వృద్ధికి తాము అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని, ఆ దిశలో త్వరలోనే వారి బృందం తెలంగాణ రాష్ట్రంలో పర్యటిస్తారని తెలియజేసారు.

పర్యటనలో భాగంగా తర్వాత వ్యవసాయశాఖ మంత్రివర్యులుఎంపీటీఆర్ఏఓఈ ఛైర్మన్ డాటో సెరి రీజల్ మెరికన్‌ని కలిసి మలేషియాతో వ్యవసాయపరంగా గల వ్యాపార అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఛైర్మెన్ ఇండియాతో వ్యాపారాభివృద్ధికి తమదేశం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది, వ్యాపార పరంగానే కాక ఇండియాతో తమకు సామాజికంగా, చారిత్రకంగా కూడా బంధము ఉన్నదని తెలియజెస్తు, బ్రోకెన్ రైస్‌కు తమ దేశంలో అత్యంత డిమాండ్ ఉందని తెలియజేయగా, మన రాష్ట్రం నుండి బ్రోకెన్ రైస్ సరఫరాకు గల అవకాశాలను పరిశీలించి త్వరలోనే తెలియజేస్తామని మిగితా 2వ పేజీలో

# బండి సంజయ్‌కు కేటీఆర్ నోటీసులు




**బలగం టీవి, హైదరాబాద్**

కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ తనపై నిరాధారమైన, తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశారంటూ కేటీఆర్ ఆయనకు లీగల్ నోటీసులు పంపారు. తనపై చేసిన నిరాధారమైన వ్యాఖ్యలకు వారం రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఈ నెల 19న బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ తనపై తప్పుడు ఆరోపణలు చేశారని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటాడనీ, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డాడని బండి సంజయ్ ఆరోపణలు చేశారు. దీనిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బండి సంజయ్ చేసిన నిరాధారమైన కామెంట్లను నోటీసులో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరు కూడా తీశారని చెప్పారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా, ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని నోటీసులో తెలిపారు. కేవలం తనను అప్రతిష్ట పాలు చేయాలన్న దురుద్దేశంతోనే బండి సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. తాను డ్రగ్స్ తీసుకుంటాననీ, ఫోన్ ట్యాపింగ్ చేశాననీ, కేసుల నుంచి తప్పించుకోవటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రహస్యంగా కలిసిపోయానంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టానుసారంగా తన పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు విస్తృతంగా మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయబడ్డాయనీ, దీని కారణంగా ప్రజలు తనను తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉందని కేటీఆర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా డ్రగ్స్ ఆరోపణలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. వాటన్నింటిని ఉద్దేశపూర్వకంగా కల్పించిన కట్టుకథలుగా కొట్టిపారేశారు. కేంద్రమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ లాంటి వ్యక్తి చేసే ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి ఉంటుందన్నారు. ఎలాంటి ఆధారాల్లేకుండా కేవలం తనపై బురద చల్లాలన్న దురుద్దేశం, తమ పార్టీ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లాలనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ నోటీసులో తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, తొమ్మిదేండ్లు రాష్ట్ర మంత్రిగా తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేసిన తనను ఉద్దేశపూర్వకంగా బద్నాం చేసే కార్యక్రమం పెట్టుకున్నారని చెప్పారు. గతంలోనూ బండి సంజయ్ తనపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తుచేశారు. రాజకీయంగా తనను ఎదుర్కొనే శక్తి లేకనే తన వ్యక్తిత్వంపై బురదచల్లే ప్రయత్నం గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదే పదే ఇలాంటి ఆరోపణలు చేయటం ద్వారా ప్రజల్లో తన ప్రతిష్టను నాశనం చేయాలనే కుట్ర తప్ప వారి ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు.

### భయపడే వారెవరూ లేరు : బండి సంజయ్

లీగల్ నోటీసులతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కేటీఆర్ పంపిన లీగల్ నోటీసులపై ఆయన స్పందించారు. “నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోంది. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. నాపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే. అందుకు బదులుగానే నేను మాట్లాడాను. ఆయన బాగోతం ప్రజలకు తెలుసు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు. ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చాను. లీగల్ నోటీసులకు నోటీసులతోనే బదులిస్తా. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం. చట్టం, న్యాయం ప్రకారం ముందుకు వెళ్తాం.” అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# గవర్నర్‌తో కొత్త వీసీల భేటి

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరణలు, సంస్కరణలపై సమావేశం చర్చించింది. ఈ సందర్భంగా ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగారం గవర్నర్ ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని మరింత ఉన్నత స్థితికి తీసుకొచ్చేలా కృషి చేస్తానని అన్నారు. సమావేశంలో పాల్గొన్న ఇతర విశ్వవిద్యాలయాల ఉపకులపతులు విద్యారంగ అభివృద్ధి, విద్యార్థులకు ఉత్తమ నైపుణ్యాలను అందించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఐ. పురుషోత్తం ఆయా విశ్వవిద్యాలయాల ఉపకులపతులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుకు సహకారం అందించడండి

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. వెంటనే మంత్రివర్యులు హెచ్ఏసీఏ ఎండీ ( చంద్రశేఖర్ రెడ్డిని టెలిఫోన్ లో సంప్రదించి మన రాష్ట్రంలో బ్రోకెన్ రైస్ ఎగుమతి చేయడానికి, దానికి సంబంధించిన ఎకనామిక్స్‌ను పరిశీలించి, మన వరి రైతులకు అదనపు ప్రయోజనం కలిగితే, వచ్చే యాసంగి కల్లా ఎగుమతి చెయ్యడానికి సిద్ధంగా ఉండాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సాయంత్రం పర్యటనలో భాగంగా మలేషియా పామ్ ఆయిల్ బోర్డును సందర్శించి, పామ్ ఆయిల్ రంగంలో వాళ్ళ అనుభవాలను ఎంపీఓబీ ఛైర్మన్ డా. అహ్మద్ పర్వేజ్ గులామ్ ఖాదీర్ గారు పర్యటన బృందంతో పంచుకున్నారు. ఎంపీఓబీ, ఆయిల్ పామ్ సాగులో ఒక నూతన ఒరవడిని సృష్టించిందని, అంతేగాక ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే ప్రాంతాలలో పంట విస్తరణకు కావాల్సిన సాంకేతిక సహాయం అందిస్తుందని మంత్రివర్యులకు తెలియజేశారు.

# హెూంమంత్రిని నియమించండి

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రానికి తక్షణమే హెూం మంత్రిని నియమించి, శాంతి భద్రతలను కాపాడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. అంబర్‌పేట్‌లోని సాయిబాబా నగర్‌లో ఇటీవలే వృద్ధ దంపతులు లింగారెడ్డి, ఊర్మిళ దేవి దారుణ హత్యకు గురికాగా, వారి కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ లింగారెడ్డి, ఊర్మిళ అనే వృద్ధ దంపతులను పట్టపగలు వారి ఇంటిపై దాడి చేసి కిరాతకంగా హత్య చేశారన్నారు. లింగారెడ్డి ముగ్గురు కుమార్తెలు అమెరికాలో ఉన్నారు. హైదరాబాద్ లాంటి ప్రశాంతమైన నగరంలో ఇలాంటి సంఘటన జరగటంతో వారంతా షాక్‌లో ఉన్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో 10 లక్షలు సీసీ కెమెరాలు పెట్టడం జరిగింది. ఏ బస్తీకి ఆ బస్తీ సీసీ కెమెరాలు పెట్టడం జరిగిందన్నారు. పోలీసులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి పనిచేయమన్నాము.. శాంతిభద్రతలు బాగుండేనన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఈ కేసుని పోలీసులు చేధించలేకపోయారు అని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో లేవని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. పోలీసులకు సరైన వ్యవస్థ, స్వేచ్ఛను ఇచ్చి వాళ్ల పని వాళ్లను చేసుకోనివ్వాలన్నారు. పోలీసు అధికారులను తమ పైకి.. అశోక్ నగర్‌లో పిల్లల పైకి ఉసికొల్పకుండా శాంతిభద్రతలు చూడనివ్వాలన్నారు. సమర్థవంతమైన పోలీస్ అధికారులు చాలా మంది ఉన్నారు.. వారికి ఫ్రీడమ్ ఇవ్వండి.. పని చేయనివ్వండి అని అన్నారు. పని చేయని సీసీ కెమెరా లును బాగు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంటుంది. మీతో కాకపోతే తమ సొంత ఖర్చులతో అయినా చేయిస్తామని కేటీఆర్ చెప్పారు.

# కాళేశ్వరం కమిషన్ విచారణ షురూ..

(మొదటి పేజీ తరువాయి)

ఓపెన్ చేయకూడదని ఎవరు ఆదేశించారని అడిగింది. మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ మాన్యువల్ ప్రిపేర్ చేసిందా? అంటూ ఈఎన్‌సీ నాగేందర్‌ను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. 2021 జనవరి వరకు ఆపరేషన్ సైన్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేక సిబ్బంది లేరని కమిషన్ ముందు నాగేందర్ తెలిపారు. 2021 జనవరిలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ టీం ఫామ్ అయిన తర్వాత రామగుండం ఈఎన్‌సీకి రిపోర్టు ఇచ్చామని తెలిపారు.

ఈ సందర్భంగా రామగుండం ఈఎన్‌సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్టు కమిషన్ ముందు చెప్పడంతో.. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీల్లో లీకేజీలు జరిగాయా అని.. గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. అలాగే వరదల సమయంలో గేట్లు ఓపెన్ చేయకూడదనీ, పరిమితికి మించి బ్యారేజీలలో నీళ్లను స్టోర్ చేయమని ఎవరు ఆదేశించారని కమిషన్ అడిగింది. రామగుండం ఈఎన్‌సీ నిబంధనలు పాటించలేదని కమిషన్ ముందు ఈఎన్‌సీ నాగేందర్ చెప్పినట్టు తెలుస్తోంది. రామగుండం ఈఎన్‌సీ స్టేట్ అండ్ సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదన్నట్టుగా కమిషన్ ముందు చెప్పారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లనే మూడు బ్యారేజీలు డ్యామేజ్ అయ్యాయా? అని కమిషన్ పదేపదే ప్రశ్నించింది. దీంతో మెయింటెనెన్స్ లేదని ఒప్పుకున్నారు. ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఇచ్చిన రిపోర్ట్స్‌పై ఎలాంటి యాక్షన్ రామగుండం ఈఎన్‌సీ తీసుకోలేదన్నారు. ఓ అండ్ ఎం ఇన్‌స్పెక్షన్ రిపోర్టును కమిషన్‌కు ఈఎన్‌సీ నాగేందర్ సమర్పించారు. సీడబ్ల్యూసీ మాన్యువల్ నిబంధనలు ఫాలో చేశారా? అని కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఫాలో చేయలేదని నాగేందర్ సమాధానం ఇచ్చారు. “ఐఎస్ కోడ్ పాటించారా?” అని అడగగా.. లేదని ఆన్సర్ ఇచ్చారు. డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించారా? అని అధికారులను కాళేశ్వరం కమిషన్ అడిగింది. నిర్మాణ సంస్థలు అగ్రిమెంట్ ఆపరేషన్స్ ప్రొటోకాల్ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ ఫాలో అయ్యారా అన్న ప్రశ్నకు కాలేదని నాగేందర్ సమాధానం చెప్పారు. వెథర్స్ షెడ్యూల్ ఫాలో అయ్యారా అని ప్రశ్నించగా.. దానికి కూడా కాలేదనే ఈఎన్సీ సమాధానం ఇచ్చారు. మూడు బ్యారేజీలలో నీళ్లను నిల్వ చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా.. 2019 నుంచి మూడు బ్యారేజీలలో పరిమితి నీళ్లను నిలువ చేసినట్టు కమిషన్ ముందు నాగేందర్ వెల్లడించారు.

# టీ20లో జింబాబ్వే వరల్డ్ రికార్డ్

## 20 ఓవర్లలో 344 పరుగులు

**బలగం టీవి, హైదరాబాద్**



అంతర్జాతీయ టీ20ల్లో జింబాబ్వే క్రికెట్ జట్టు ప్రపంచ రికార్డు సృష్టించింది. టీ20 వరల్డ్‌కప్ సబ్ రీజినల్ ఆఫ్రికా క్వాలిఫైయర్ టోర్నీలో గాంబియాతో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే తమ 20 ఓవర్లలో ఏకంగా 344/4 పరుగులు చేసింది. దీంతో అత్యధిక టీ20 పరుగులు సాధించి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది. దీంతో టీ20 హిస్టరీలోనే అత్యధిక పరుగులు నమోదు చేసిన జట్టుగా జింబాబ్వే ప్రపంచ రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలోనే నేపాల్ (314 పరుగులు , మంగోలియా, 2023 ఆసియా క్రీడలు) రికార్డును బ్రేక్ చేసింది.

జింబాబ్వే బ్యాటర్లలో సికిందర్ రజా 43 బంతుల్లోనే 133 పరుగులతో విధ్వంసం సృష్టించాడు. ఇందులో ఏకంగా 15 సిక్స్‌లు ఉన్నాయి. ఓపెనర్లు బ్రియాన్ బినెట్ (50 పరుగులు, 26 బంతుల్లో ), తడివానాశే మారుమణి (62 పరుగులు), క్లైవ్ మండాడే (53 పరుగులు) అదరగొట్టారు. గాంబియా బౌలర్లలో ముస జొబారెత్ తన నాలుగు ఓవర్ల స్పెల్‌లో వికెట్ లేకుండా 93 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇక అండ్రీ 2, అర్జున్‌సింగ్, బుబాకర్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు

భారీ లక్ష్య ఛేదనలో దిగిన గాంబియా 14.4 ఓవర్లలో 54 పరుగులకే కుప్పకూలింది. గాంబియా బ్యాటర్లలో తొలి 10 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరడం విశేషం. 10వ స్థానంలో క్రీజులోకి వచ్చిన ఆండ్రీ (12) టాప్ స్కోరర్?. దీంతో జింబాబ్వే 290 పరుగుల తేడాతో నెగ్గింది. టీ20ల్లో పరుగుల పరంగానూ ఇదే భారీ విజయం. ఇంతకుముందు ఈ రికార్డు నేపాల్ పేరిట ఉండేది. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ నగరవ 3, బ్రాండన్ మావుట 3, వెస్లీ మధ్వీర 2, ర్యాన్ బర్ల్ ఒక వికెట్ పడగొట్టారు.

# చదవాలి.. రాయాలి.. నిత్యం సాధన చేయాలి..



- **రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

విద్యార్థులు నిత్యం తమ పాఠ్యాంశాలను చదువుతూ, రాస్తూ సాధన చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం పరీక్ష కోసం విద్యార్థులు చదువుతుండగా,పలు అంశాల పై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

విద్యార్థులకు కోసం సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ఏ ఏ వంటకాలు తయారు చేస్తున్నారో తనిఖీ చేశారు. కూరగాయలు, పప్పుతో సాంబారు, ఉడికించిన గుడ్డు సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ దృష్టికి ప్రధానోపాధ్యాయురాలు శారద తీసుకెళ్లారు. మొత్తం ఎందరు విద్యార్థులు చదువుతున్నారో వివరాలు అడగగా, మొత్తం 807 మంది చదువుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ . విద్యార్థులు తరగతి గదుల్లో నిత్యం జరిగే అన్ని పాఠాలకు సంబంధించి నోట్స్ తయారు చేసుకోవాలని సూచించారు. రోజు వాటిని చదవడం.. రాయడంతో వాటిపై పట్టు సాధిస్తారని పేర్కొన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పీయూసీ) సమావేశం

**బలగం టీవీ , హైదరాబాద్**

శాసనసభ భవనంలోని కమిటీ హాల్ లో బుధవారం జరిగిన ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పీయూసీ) ప్రారంభ సమావేశం.

పీయూసీ చైర్మన్, షాద్ నగర్ శాసనసభ్యులు కే. శంకరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హాజరైన శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కమిటీ సభ్యులు సంజీవ రెడ్డి, లక్ష్మీకాంతారావు, శేరి సుభాష్ రెడ్డి, తాతా మధుసూదన్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, లేజిస్లేటివ్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, తెలంగాణ రాష్ట్ర అకౌంటంట్ జనరల్ పి మాధవి, డిప్యూటి అకౌంటంట్ జనరల్ నాగేశ్వర్ రెడ్డి తదితరులు..

సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థల కమిటి చైర్మన్ కె. శంకరయ్యకి, కమిటీ సభ్యులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

శాసన మండలి ద్వారా ఏర్పాటు చేయబడిన కమిటీలలో ప్రభుత్వ లెక్కల కమిటి, అంచనాల కమిటి మరియు ప్రభుత్వరంగ సంస్థల కమిటి చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వానికి సంబంధించిన వివిధ శాఖలు మరియు ప్రభుత్వరంగ సంస్థల ఆర్థిక వ్యవహారాలను సమీక్షించి, తగు సూచనలు చేస్తాయి.

కమిటీ సభ్యులందరూ ప్రతి సమావేశానికి హాజరై, ప్రభుత్వరంగ సంస్థలకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా అధ్యయనం చేసి, క్రియాశీలకంగా చర్చల్లో పాల్గొని, ప్రభుత్వరంగ సంస్థలను బలపరచుటకు తమ విలువైన సలహాలను, సూచనలను ప్రభుత్వానికి ఇవ్వవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కమిటీ చైర్మన్ చాలా ఉత్సాహవంతుడు మరియు కష్ట పడి పని చేసే మనస్తత్వం కలవాడు. అందరినీ కలుపుకొనిపోయే మనస్తత్వమున్న వారి నాయకత్వంలో కమిటీ చాలా సమర్ధవంతంగా పనిచేస్తుందనే నమ్మకం, విశ్వాసం నాకున్నాయి. కాబట్టి, ప్రభుత్వరంగ సంస్థలలోని అవకతవకలను, లోపాలను సరిదిద్దడం ద్వారా అన్ని ప్రభుత్వరంగ సంస్థలు బలపడి, ఆరోగ్యకరంగా పనిచేసి, ప్రభుత్వానికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించడానికి కమిటీ పని చేయాలని మనసారా కోరుకుంటున్నాను.

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రసంగిస్తూ ప్రభుత్వరంగ సంస్థల కమిటి అత్యంత ప్రాధాన్యత గల కమిటి. ప్రభుత్వానికి రాబడిని తీసుకొచ్చే ప్రభుత్వరంగ సంస్థలు ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పటిష్టమైన వ్యాపార సూత్రముల ప్రకారంగా, వివేకవంతమైన వాణిజ్య సాంప్రదాయము ప్రకారముగాను పని చేస్తున్నాయా అని చూడడమే కాకుండా, ప్రభుత్వరంగ సంస్థల అకౌంట్లను, నివేదికలను మరియు సీఏజీ వారు సమయానుసారము ప్రభుత్వరంగ సంస్థలపై ఇచ్చే నివేదికలను పరిశీలించి, తిరిగి వాటిపై శాసన మండలికి తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలను సమర్పిస్తుంది.

పరిశీలన నిమిత్తం అవసరమైతే కమిటీ క్షేత్ర స్థాయి పర్యటనలు కూడా చేపట్టవచ్చు. ఇతర రాష్ట్రాలు సందర్శించి, ఆయా రాష్ట్రాలలోని సిస్టర్ కమిటీలతో సమావేశము నిర్వహించవచ్చు.

శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రసంగిస్తూ... పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కమిటీలకు అత్యంత ప్రాధాన్యం ఉన్నది. కార్యనిర్వాహక శాఖ, శాసన నిర్మాణ వ్యవస్థకు తద్వారా ప్రజలకు ఎప్పుడూ జవాబుదారీగా ఉండాలి. ఈ సూత్రాన్ని తూ.చా. తప్పకుండా అమలు చేయాలంటే రెండు వ్యవస్థల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలి.

భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన అతి ముఖ్యమైన ఫైనాన్షియల్ కమిటీలలో ఇది కూడా ఒకటి. ప్రభుత్వ రంగ సంస్థల పనితీరును కంట్రోల్ చేయుట దీని ముఖ్య ఉద్యేశ్యము.

రాష్ట్ర ప్రభుత్వం అజమాయిషీలోని ప్రభుత్వరంగ సంస్థల/కార్పోరేషన్ల అకౌంట్లను, నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించి మరియు వాటిని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయు అధికారం ఈ కమిటీ కలిగి ఉన్నది.

కమిటీ చైర్మన్ కే. శంకరయ్య మాట్లాడుతూ... శాసన మండలి ద్వారా ఏర్పాటు చేయబడే ఫైనాన్షియల్ కమిటీలలో ముఖ్యమైన ప్రభుత్వరంగ సంస్థల కమిటీకి నన్ను చైర్మన్ గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నాను. గతంలో ఎంతో మంది ప్రముఖులు, మేధావులు ఈ కమిటీకి చైర్మన్లు గా సేవలు అందించారు.

కమిటి సభ్యులు వివిధ రాజకీయ పార్టీలకు చెందినప్పటికీ కమిటి సమావేశాలలో ఫలప్రదమైన చర్చలు జరిపి సాధ్యమైనంత వరకు ఏకాభిప్రాయముతో నిష్పక్షపాతంగా పనిచేసి, కమిటీ తన కర్తవ్యాలను నెరవేర్చు మరియు లక్ష్యాలను సాధించుటలో మనమందరం సమిష్టిగా కృషి చేయవలసిన అవసరం ఉన్నది.

గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యమవుతున్నాయి. ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులకు జీతభత్యాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. కారణాలు ఏమైనా ప్రభుత్వరంగ సంస్థలకు నూతన జవసత్వాలను తీసుకొచ్చి, తిరిగి ఆ సంస్థలను బలోపేతం చేసి నూతనోత్తేజముతో పని చేసే విధంగా ఈ కమిటి పని చేస్తుందని, అందుకు సభ్యులందరు సహకరించాలని కోరుకుంటున్నాను.

# ఏసీబీకి చిక్కిన విద్యుత్ ఉద్యోగి

**బలగం టీవీ , హైదరాబాద్**

ఓ ఇంటి యాజమాని నుండి లంచం తీసుకుంటున్న విద్యుత్ ఉద్యోగిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మున్సిపల్ పరిధి కరకవాగులో ఓ వ్యక్తి నూతనంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. తాత్కాలికంగా దీనికి అవసరమైన విద్యుత్ సౌకర్యం పక్కనే ఉన్న వారి బంధువుల ఇంటి నుండి తీసుకున్నాడు. దీనిని గమనించిన విద్యుత్ లైన్‌మెన్ నాగరాజు అక్రమంగా విద్యుత్‌ను వినియోగించు కుంటున్నారని సదరు గృహ యాజమానిపై కేసు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డాడు.కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.60 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో రూ.26 వేలు ఇస్తామని గృహ యాజమాని అన్నాడు.అనంతరం ఇంటి నిర్మాణ దారుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. గాంధీనగర్ 5వ వార్డులోని బిసిఎం ప్రధాన రహదారి పక్కన ఉన్న ఓ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద లైన్‌మెన్ లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కాగా, గతంలో కూడా లైన్‌మెన్ నాగరాజుపై పలు ఆరోపణలు ఉన్నాయని సమాచారం.

# ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు..

**బలగం టీవీ ,, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన లో ఖాళీగా ఉన్న పలు వైద్య పోస్ట్ లు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జీజీహెచ్ లోని బ్లడ్ బ్యాంక్, ఎమర్జెన్సీ వార్డ్ ల్లో నాలుగు పోస్టులు ఖాళీ ఏర్పడగా, ఆయా పోస్టులకు సివిల్ అసిస్టెంట్ (ఎం బీ బీ ఎస్) అర్హతగా నిర్ణయించి, దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం తొమ్మిది మంది హాజరు కాగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన అభ్యర్థులకు తన చాంబర్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముగ్గురిని ఎంపిక చేసినట్లు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపర్డెంట్ లక్ష్మీనారాయణ వివరించారు. ఈ ఇంటర్వ్యూలలో డీఎం హెచ్ ఓ వసంత రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ ద్వంద్వ విధానాలు..

- **మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు**



**బలగం టీవీ , హైదరాబాద్**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ద్వంద్వ విధానాలు, మోసపూరిత వైఖరి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలతో మరోసారి రుజువైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశమంతా తిరిగి రాజ్యాంగ రక్షణ కోసం ప్రవచిస్తుంటే, తెలంగాణలో మాత్రం ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడం కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీ గారి ద్వంద ప్రమాణాలకు నిదర్శనం అని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకే ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నామని స్వయంగా రాష్ట్ర పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చేందుకు రాజ్యాంగాన్ని కాపాడుతున్నానని చెప్పుకుంటూ, అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేయడం రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం అని మండిపడ్డారు.

## ప్రజాపాలన అంటూ నిర్బంధాల పాలన

నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ నాయకుల అరెస్టుల పట్ల ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైరయ్యారు. రామన్నపేటలో నిర్మించ తలపెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు పార్టీ నేతలు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ నాయక్, భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిషోర్ సహా ఇతర నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులను అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్వేచ్ఛగా జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ, ఇంతటి నిర్బంధాల మధ్య చేయడం అప్రజాస్వామికమని చెప్పారు. ప్రజాపాలన అంటూ నిర్బంధాల పాలన కొనసాగించడం సిగ్గుచేటని విరుచుకుపడ్డారు. అక్రమంగా అరెస్టులు చేసిన బీఆర్ఎస్ నాయకులను, ప్రజా సంఘాల నేతలను, పర్యావరణవేత్తలను తక్షణం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


## డిజిటల్ సర్వేకు ఒప్పుకోలేదన్న కారణంతో 163 మంది ఏఈవోలను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం : హరీశ్‌రావు

మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రైవేటు కంపెనీలు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ద్వారా డిజిటల్ సర్వే చేయిస్తుంటే, తెలంగాణలో ఏఈవోలపై అదనపు భారాన్ని రుద్దుతూ వేధింపులకు గురిచేయడం దుర్మార్గం అని ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు.

“రాష్ట్రంలో వ్యవసాయ విస్తరణ, సాగు పెంపుదల లక్ష్యంలో భాగంగా 1500 కొత్త ఏఈవోల పోస్టులను సృష్టించారు. దేశానికే అన్నపూర్ణగా ఎదిగిన తెలంగాణ విజయగాథలో ఏఈవోల పాత్ర ఎంతో ఉంది. అలాంటి వారి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడం శోచనీయం. ఉద్యోగులపై బలవంతంగా భారం వేయడం, మాట వినలేదని సస్పెండ్ చేయడమేనా మీ ప్రజాపాలన.సస్పెండ్ చేసిన 163 ఏఈవోలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, డిజిటల్ సర్వే ఏఈవోలకు భారం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం” అని అన్నారు.

# 25న ఓయూలో జాబ్ మేళా

**బలగం టీవీ , హైదరాబాద్**



ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో రిలయన్స్ నిప్పోన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈ నెల 25న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. కంపెనీలోని 30 లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులను జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు. డిగ్రీ, మాస్టర్స్ పూర్తి చేసిన 29 నుంచి 45 సంవత్సరాల వయసు గల మహిళలకు మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. మరిన్ని వివరాలకు ఎంప్లాయిమెంట్ అధికారి జోషిని (8340037123) ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్లతో యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద హాజరు కావాలని సూచించారు.

# భారత్ ప్రతీకారం తీర్చుకునేనా..?



- నేటి నుంచి పుణెలో భారత్ న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు
- పిచ్ స్పిన్‌కు అనుకూలం..!
- సిరీస్ సమం చేయాలని భావిస్తున్న భారత్

**బలగం టీవీ, పుణె**

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు 8 వికెట్ల తేడాతో ఘోరంగా ఓడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పుణె వేదికగా నేటి నుంచి జరగబోయే రెండో టెస్టులో ప్రతీకారం తీర్చుకోవాలని భారత జట్టు భావిస్తోంది. ఇప్పటికే భారత్, న్యూజిలాండ్ జట్లు ప్రాక్టీస్ చేస్తున్నాయి. రెండో టెస్టులో ఎలాగైనా గెలిచి సిరీస్‌పై పట్టు సాధించాలని భారత్ భావిస్తోంది.

భారత జట్టు ఈ ఏడాది ఆస్ట్రేలియాలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్టులు ఆడనుంది. ఈ నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ బెంగళూరు పిచ్‌ను పేస్ బౌలింగ్‌కు అనుకూలంగా మార్చటానికి కృషి చేశారు.కానీ తొలి టెస్టులో న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్లు విజయం సాధించడంతో భారత్ కేవలం 46 పరుగులకే ఆలౌటయ్యింది. ప్రస్తుతం టీమ్ ఇండియా పుణె టెస్టులో ఓడితే సిరీస్ కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే వారు స్పిన్ పిచ్‌ను సహజంగా ఉంచాలని క్యూరేటర్‌ను ఆదేశించినట్టు తెలుస్తోంది.

పుణె పిచ్‌లో ఎక్కువ నల్లమట్టిని వినియోగించడం వల్ల స్పిన్‌కు అధికంగా అనుకూలించనుంది. పేసర్లకు ఎక్కువగా మద్దతు ఉండదు. పిచ్ ఫ్లాట్‌గానే ఉంటుంది. దీంతో స్పిన్ విభాగం పటిష్టంగా ఉన్న భారత్‌కు ఇది కలిసి వచ్చే అంశంగా ఉంది. న్యూజిలాండ్ బ్యాటర్లకు ఇది కష్టంగా మారే ఛాన్స్ కనిపిస్తోంది. కివీస్ జట్టు స్పిన్ విభాగం కూడా పెద్ద పటిష్టంగా లేదు. దాంతో ఇండియా టీమ్‌లో ఉన్న రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, రవిచంద్రన్ అశ్విన్ వంటి స్పిన్నర్లు న్యూజిలాండ్ బ్యాటర్లకు సమస్యల్ని తేవడం ఖాయంగా కనిపిస్తోంది. పుణె పిచ్ మొదటి రెండు రోజుల్లో ఫాస్ట్ బౌలర్లకు సహకారం అందిస్తుంది. కానీ మూడో రోజున స్పిన్నర్లు తమ పని చేయడం ప్రారంభిస్తారు. ఐదో రోజున, బ్యాటర్లు బంతి గమనాన్ని అంచనా వేయడం చాలా కష్టమవుతుందని తెలుస్తోంది.

భారత్ ఈ రెండో టెస్టుకు కూడా ముగ్గురు స్పిన్నర్లతోనే బరిలోకి దిగే అవకాశం ఉంది. రవిచంద్రన్ అశ్విన్, కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా కొనసాగే ఛాన్స్ ఉంది.

## కేఎల్ రాహుల్‌కు గంభీర్ మద్దతు



**సోషల్ మీడియాలో జనాలు, నిపుణులు ఏం ఆలోచిస్తున్నారో అసలు ముఖ్యం కాదని గౌతమ్ గంభీర్ అన్నాడు. సోషల్ మీడియాలో రాహుల్‌పై వస్తున్న విమర్శల నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ "తుది జట్టును సోషల్ మీడియా నిర్ణయించదు. సోషల్ మీడియా, నిపుణులు ఏం ఆలోచిస్తున్నారో ముఖ్యం కాదు. టీమ్ మేనేజ్‌మెంట్ ఏమనుకుంటుందో అది ముఖ్యం. కఠినమైన కన్పూర్ పిచ్‌పై అతడు (రాహుల్) మంచి బ్యాటింగ్ చేశాడు. అతడు భారీ స్కోర్లు చేయాలని అనుకుంటున్నాడు. అతడికి మద్దతు ఇచ్చేందుకే టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది" అని చెప్పాడు.**

# కోహ్లీ ర్యాంకును అధిగమించిన పంత్



- టెస్టు ర్యాంకింగ్స్ విడుదల చేసిన ఐసీసీ
- 15వ ర్యాంక్‌కు పడిపోయిన రోహిత్ శర్మ

**బలగం టీవీ, ముంబై**

: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బుధవారం తాజా టెస్టు ర్యాంకింగ్స్? ఈ ర్యాంకింగ్స్‌లో టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ రిషభ్ పంత్ మూడు స్థానాలు ఎగబాకి విరాట్ కోహ్లీనీ అధిగమించాడు. ప్రస్తుతం పంత్ 745 రేటింగ్స్‌తో ఆరో స్థానంలో నిలిచాడు. మరోవైపు విరాట్ (720 రేటింగ్స్) ఒక స్థానం దిగజారి ఎనిమిదో స్థానానికి పడిపోయాడు. యశస్వి జైస్వాల్ (780 రేటింగ్స్)నాలుగో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ (917 రేటింగ్స్) అగ్రస్థానంలోనే ఉన్నాడు. కేన్ విలియమ్సన్ 821 రేటింగ్స్‌తో రెండో స్థానంలో ఉన్నాడు. కాగా, టాప్ 10లో ముగ్గురు భారత బ్యాటర్లు ఉన్నారు.

ఇక టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ రెండు స్థానాలు కోల్పోయి 15వ ప్లేస్‌లో కొనసాగుతున్నాడు. మరోవైపు భారత్‌తో తొలి టెస్టులో భారీ శతకంతో అదరగొట్టిన రచిన్ రవీంద్ర తాజా ర్యాంకింగ్స్‌లో ఏకంగా 36 స్థానాలు ఎగబాకాడు. 681 రేటింగ్స్?తో రచిన్ ప్రస్తుతం 18వ ప్లేస్?లో కొనసాగుతున్నాడు. ఇక పాకిస్థాన్ ప్లేయర్ సలమ్ అఘా ఎనిమిది స్థానాలు మెరుగుర్చపకున్నాడు. సలమ్ అఘా ప్రస్తుతం 684 రేటింగ్స్‌తో 14వ స్థానంలో కొనసాగుతున్నాడు.

# 103 బంతుల్లో డబుల్ సెంచరీ

### లిస్ట్-ఏ క్రికెట్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ విధ్వంసం



**బలగం టీవీ, ముంబై**

లిస్ట్-ఏ క్రికెట్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ చాద్ బౌస్ చరిత్ర సృష్టించాడు. అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ సాధించిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు నమోదు చేశాడు. 103 బంతుల్లో ద్విశతకాన్ని అందుకున్నాడు. ఈ క్రమంలో భారత ఆటగాడు నారాయణ్ జగదీషన్ , ఆస్ట్రేలియా విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ గత వరల్డ్ రికార్డులను బ్రేక్ చేశాడు.

ఫోర్డ్ ట్రోఫీలో కాంటర్బరీ తరఫున ప్రాతినిథ్యం వహిస్తున్న చాద్ బౌస్ ఒటాగోతో జరిగిన మ్యాచ్‌లో 110 బంతుల్లో 205 పరుగులు చేశాడు. 27 ఫోర్లు, 7 సిక్సర్లు బాదాడు. చాద్ ద్విశతకంతో సత్తాచాటడంతో కాంటర్బరీ నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 343 పరుగులు చేసింది. బేకన్ అయిదు వికెట్లు తీశాడు. కాంటర్బరీ జట్టులో చాద్ తర్వాత అత్యధిక స్కోరు జకరీ ఫోక్స్ చేసిన 49 పరుగులే.

అనంతరం ఛేదనలో ఒటాగో 24.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. సీన్ డేవీ, మైకేల్ రిప్పన్ చెరో మూడు వికెట్లు తీశారు. చాద్ బౌస్ కంటే ముందు ఫాస్టెస్ డబుల్ సెంచరీ రికార్డు హెడ్, జగదీషన్ పేరిట ఉండేది. వీరిద్దరు 114 బంతుల్లో ద్విశతకం బాదారు.

# సింహాసనంపై డిఫరెంట్ లుక్‌లో రెబల్ సాబ్




**బలగం టీవీ, హైదరాబాద్**

ప్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం రాజాసాబ్. మారుతి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం హార్రర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కుతుంది. బుధవారం ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ అదిరిపోయే లుక్‌ను విడుదల చేశారు. అభిమానుల కోసం ఓ డిఫరెంట్ మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అందులో ప్రభాస్ ఎప్పుడూ చూడని విధంగా సరికొత్తగా కనిపించారు. ఇందులో ప్రభాస్ సింహాసనంపై కూర్చొని సిగార్ కాలుస్తూ రాజు లుక్‌లో కనిపించారు

"రాజసం ఆయన బ్లడ్‌లోనే ఉంది. వివాదరహితుడైన పాలనాదక్షుడు 2025 ఏప్రిల్ 10న వస్తున్నాడు. దీనికే ఇలా అయిపోతే ఎలా ముందు ఉంది అసలైన పండగ.." అంటూ ట్వీట్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ , ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

### సలార్ 2 షూట్ మొదలు

సలార్ 2 అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్న ప్రభాస్ అభిమానుల కోసం ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా సలార్ 2 షూటింగ్ మొదలైంది. హోంబలే ఫిలిమ్స్ ప్రకటించిన మోస్ట్ ఎవెయిటెడ్ సీక్వెల్ సలార్ 2 చిత్రీకరణలో ప్రశాంత్ నీల్, ప్రభాస్, పృథ్వీరాజ్.. ప్రభాస్ ఈ షెడ్యూల్‌లో 20 రోజులపాటు పాల్గొనబోతున్నాడు.. అంటూ ఫిల్మ్ క్రిటిక్ తరణ్ ఆదర్శ్ ట్వీట్ చేశారు. హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై విజయ్ కిరంగదూర్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. 2025 డిసెంబర్‌లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టు టాక్.

## మళ్లీ మేం కలిశాం.. అంటే..?




**బలగం టీవీ, హైదరాబాద్**

దర్శకుడు ప్రశాంత్ వర్మ, తేజ సజ్జ కాంబినేషన్ లోవచ్చిన భారీ హిట్ చిత్రం "హను మాన్" . ఈ సినిమాక సీక్వెల్ "జై హనుమాన్" ని ప్రశాంత్ వర్మ ఇప్పటికే అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమా షూటింగ్ సహా మరిన్ని సినిమాలు చేస్తున్న యువ దర్శకుడు నుంచి ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఒకటి ఇచ్చాడు. ఒక కోతి తన దగ్గరకి వచ్చిన పిక్ ని పోస్ట్ చేసి "మేము మళ్ళీ కలిసాం ఇదే సంకేతం" అంటూ పోస్ట్ చేసాడు. అలాగే దీపావళి వస్తుంది అంటూ కూడా ఒక ట్యాగ్ పెట్టాడు. దీనితో ఈ దీపావళికి జై హనుమాన్ నుంచి అప్డేట్ ఉండొచ్చని హిట్ ఇచ్చాడు.